# ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 21.05.2018 సమయం : 1310 గంటలు

## ముఖ్యాంశాలు

1. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోని తొలిస్థానంలో ఉందని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి తారక రామారావు అన్నారు.

2. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా తెలంగాణలో పోలింగ్ కేంద్రం స్థాయి అధికారులు ఈ రోజు నుంచి ఇంటింటికి వెళ్లి ఓటర్ల నమోదు, పరిశీలన ప్రక్రియను చేపడతారు.

3. మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఈ రోజు దేశవ్యాప్తంగా ఆయనకు నివాళులర్పిస్తున్నారు.

4. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ మావోయిస్టులు ఆంధ్ర, ఛత్తీస్‌గడ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఈ రోజు బంద్‌కు పిలుపునిచ్చారు.

5. ప్రముఖ రచయిత్రి యద్ధనపూడి సులోచనరాణి మృతి చెందారు.

-------------

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోని తొలిస్థానంలో ఉందని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి తారక రామారావు అన్నారు. హైదరాబాద్‌లో శ్రీ మర్రి చెన్నారెడ్డి  మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఈ ఉదయం జరిగిన తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభివృద్ధి కార్యక్రమాల అమలు, భూరికార్డుల ప్రక్షాళన తదితర 13 విభాగాల్లో ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి తారక రామారావు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక విధానం అందరిని ఆకట్టుకోంటుందని చెప్పారు. అభివృద్ధిలో అధికార యంత్రాంగం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో  ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. జోషి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

-----------------

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా తెలంగాణలో పోలింగ్ కేంద్రం స్థాయి అధికారులు ఈ రోజు నుంచి ఇంటింటికి వెళ్లి ఓటర్ల నమోదు, పరిశీలన ప్రక్రియను చేపడుతారు. వచ్చే నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అనంతరం జులై 2 నుంచి 31వ తేదీ వరకు ఓటర్ల నమోదుపై విస్తృత ప్రచారం నిర్వహిస్తారు. ఆగస్టు 1 నుంచి 31వ తేదీలోగా ఓటర్ల జాబితా ముసాయిదాను రూపొందించి సెప్టెంబర్ 1వ తేదీన జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలను సెప్టెంబర్ 31వ తేదీ వరకు స్వీకరించి నవంబర్ 30లోగా వాటిని పరిష్కరిస్తారు. వచ్చే ఏడాది 4వ తేదీ తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. గతంలో ఓటర్లుగా నమోదు చేసుకోని వారు. చిరునామా మారిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి డాక్టర్ రజిత్‌కుమార్ చెప్పారు.

-----------------

మాజీ ప్రధానమంత్రి గాంధీ వర్ధంతి సందర్భంగా ఈ రోజు దేశవ్యాప్తంగా పలుచోట్ల ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని సోమాజీ గూడ చేరస్తాలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ప్రభుత్వ, రాజకీయ  ప్రముఖులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి

-ఘటించారు. ప్రధానమంత్రిగా ఆయన అందించిన విశేష సేవలకు పలువురు ఈ సందర్భంగా ప్రస్తుతించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గాంధీ భవన్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాజీ మంత్రులు, పార్టీ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

స్వర్గీయ రాజీవ్ గాంధీ27 వర్ధంతి సందర్భంగా ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు బట్టి విక్రమార్క, మాజి ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

--------------------

కేంద్ర రిజర్వు పోలీసు దళం- (సీఆర్‌పీఎఫ్)లో తొలి ప్రత్యేక నక్సలైట్ వ్యతిరేక దళం 'బస్తరియా'ను ఈ ఉదయం రాయపూర్‌లో ప్రారంభించారు. ఈ ప్రత్యేక దళం కోసం నియమితులైన 534 మంది గిరిజన సిబ్బంది ఈ రోజు రాయపూర్‌లో జరిగిన ఉత్తీర్ణతా ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఇందులో 189 మంది మహిళా కానిస్టేబుల్స్ ఉన్నారు. సుక్మ, దతేవాడ, బీజాపూర్ వంటి నక్సలైట్ ప్రభావిత ప్రాంతంలో బస్తరియా బెటాయలిన్ సిబ్బంది నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటారు. ఛత్తీస్‌గడ్‌లోని బస్తర్ ప్రాంతానికి చెందిన గిరిజన యువకులు ఎక్కువ మంది ఈ బెటాలియన్‌లో ఉన్నందున ఈ బెటాలియన్‌కు బస్తీరియా నామాకరణం చేసిన్నట్లు అధికారులు తెలిపారు.

--------------------

ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ మావోయిస్టులు ఆంధ్ర, ఛత్తీస్‌గడ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఈ రోజు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మావోయిస్టులు విధ్వంసాలకు పాల్పడుతారని నిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేయడంతో తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తమైయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు.

--------------------

ప్రముఖ రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె వయస్సు 79 సంవత్సరాలు. కాలిఫోర్నియాలోని కుపర్టినో అనే పట్టణం లో ఈ ఉదయం గుండెపోటుతో సులోచనారాణి మృతి చెందినట్లు ఆమె కుమార్తె శైలజ తెలిపారు. సులోచనారాణి రచించిన నవలలు 70, 80 దశకాల్లో తెలుగు ప్రజలను ఉర్రూత లూగించాయి. ముఖ్యం గా ఆమె రాసిన సెక్రెటరీ, మీనా, జీవన తరంగాలు, అగ్నిపూలు, చండీ ప్రియ వంటి నవలలు విశేష ప్రాచుర్యం పొందాయి. ఆమె రాసిన నవలల ఆధారంగా అనేక సినిమాలు తీశారు. కుటుంబ కథనాలు రాయడంలో తనకు ఎవ్వరూ సాటిలేరని సులోచనారాణి నిరూపించుకున్నారు. మధ్యతరగతి జీవితాల గురించి ఆమె అనేక విషయాలను తన నవలల్లో ప్రస్తావించారు. సులోచనరాణి మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్ర శేఖర రావు, చంద్ర బాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. మానవ సంబంధాలే ఇతి వృత్తం గా చేసుకుని అనేక రచనలు చేసిన సులోచనా రాణి సాహిత్య ప్రపంచం లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని చంద్రశేఖర రావు తమ సంతాప సందేశం లో లో పేర్కొన్నారు.

---------------------

ఆనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రొద్దం మండలం తురకలపట్నం గ్రామంలో ఉదయం 11గంటలనుంచి సాయంత్రం 5 దాకా పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారని మా విలేకరి తెలియ చేస్తున్నారు.

---------------------

తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో పలుచోట్ల జరుగుతోంది. ఈ నెల 24న జరగనున్న మహానాడు సందర్భంగా వివిధ జిల్లాలలో పార్టీ మినీ మహానాడు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. భువనగిరి జిల్లా రాయగిరి పలువురు సీనియర్ నాయకులు హాజయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా ఈ మినీ మహానాడు జరుగుతోంది.

---------------------

ఐఎన్ఎస్ తరిణి నౌకపై ప్రపంచ యాత్రకు వెళ్లిన భారత నౌకదళ మహిళా సిబ్బంది తమ యాత్రను ముగించుకొని ఈ సాయంత్రానికి గోవా చేరుకోనున్నారు. గోవాలో ఈ సాయంత్రం జరిగే కార్యక్రమంలో రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ వారికి ఘన స్వాగతం పలుకుతారు. ఈ కార్యక్రమంలో నావెల్ ఛీఫ్ అడ్మిరల్ సునీల్‌లాంబ కూడా పాల్గొంటారు. 'నావిక సాగర్ పరిక్రమ' పేరిట ఐఎన్ఎస్ తరిణిలో నౌకదళానికి చెందిన ఆరుగురు సిబ్బంది గత ఏడాది సెప్టెంబర్ 10వ తేదీన తమ యాత్రకు శ్రీకారం చుట్టారు. యాత్రలో భాగంగా వీరు సముద్ర జలాలపై 21వేల నాటికల్ మైళ్లు ప్రయాణించారు.

---------------------